48
ధారావాహిక

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284



**జరిగిన కథ :**

పృథ్వీశ్వరుని తలను ఒక్కవేటుతో తెగనరికాడు గణపతిదేవుడు. అదే సమయంలో.. పినచోడుడు పరుగున వెళ్లి జాయపను హత్తుకున్నాడు. అది చూసిన గణపతిదేవుడికి వారి బంధుత్వం స్పష్టమైంది. మరోవైపు తెగిపడ్డ పృథ్వీశ్వరుని తలతో కందుక క్రీడలాడారు కాకతీయ యుద్ధవీరులు. ఇంకోవైపున.. ఆ మరుభూమిలో కత్తిగాట్లతో.. రక్తసిక్తమైన దేహాలతో నిండిన శవాలపై ఎగిరి నర్తించాడు జాయప. ఆ రుద్రదేవుడే పూనినట్లు.. యుద్ధభూమే నాట్యరంగమైనట్లు ఆనందతాండవం చేశాడు

వెలనాడు రాజ్యమంతటా యుద్ధ విజయ సంబరాలు జరుగుతున్నా.. రాజధాని దనద్రోలులోని రాజప్రాసాదం మాత్రం ఉత్తేజంగా లేదు. చక్రవర్తి వల్ల కొంత గంభీరంగా ఉంది.

పిష్టపుర యుద్ధవిజయం.. కాకతీయ రాజ్యంలోనే కాక, అన్ని సామంత రాజ్యాల్లోనూ పండుగ శోభను తెచ్చింది. చక్రవర్తిగా గణపతిదేవుని పాలనలో కాకతీయ సామ్రాజ్యపు సామంత రాజ్యాలన్నీ, ఎంతో ప్రశాంతంగా అబ్బురపరచే అభివృద్ధికి నోచుకుంటున్నాయి.

నిజానికి పిష్టపుర ప్రజలు కూడా పృథ్వీశ్వరుని మరణానికి సంతోషించారని చారులు తెచ్చిన వార్త.

ఈ విశ్లేషణ ప్రముఖులందరిలో మధురిమ చేకూరుస్తుండగా.. చక్రవర్తి మాత్రం విజయ మందహాసాల మధ్య కొండొక విచార వీచికలతో సతమతం అవుతున్నట్లు నిరంతరం స్థిరగంభీరంగా కనిపిస్తున్నాడు.

కారణం.. ఆయనకు పినచోడుడు, జాయపుడు మహోపకారం చేస్తే, ఆ కుటుంబానికి అపకారం చేసినట్లు ఆయన భావించడం! ఏడేళ్లుగా పిల్లలను తల్లిదండ్రులకు దూరం చేశాడు. వాళ్లు ఆ బాధను నిశ్శబ్దంగా పళ్లబిగువున భరించారు.

'జాయపుడు! వాడు.. ఆ కుర్రవాడు. ద్వీపరాజ్య వారసుడు. క్షత్రియ పుత్రుడు..

అంత చిన్నవయసులో బంగారు ఊయలలో పుట్టి, వీధి ఎలా ఉంటుందో తెలియని రాజనగరులో పెరిగిన వాడు. ఒక్కరోజు కాదు.. ఒక్క ఏడాది కాదు.. ఏడేళ్లు అనుమకొండ వీధులలో బతికాడట. ఎవరు ఏది పెడితే.. అదే తిన్నాడట. మూగగా ఏడ్చాడట. మురికి బట్టలతో ముడుచుకు పడుకున్నాడట.

ఎంత ప్రతిభావంతుడు. అటు నాట్యం.. ఇటు యుద్ధం! రెండిటిలోనూ సమాన ప్రావీణ్యం.. ఆ వీధులలోనే తిరుగుతూ సంపాదించాడంటే.. వాడు సామాన్యుడు కాదు. ఎక్కడా తన ధర్మాన్ని తప్పలేదు. నాట్యం తన ముందు ప్రదర్శించాడు. యుద్ధం తనతో కలిసి చేశాడు. తనను కాపాడాడు. శత్రువు తలను నరక